# పేదల సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యం

- కాంగ్రెస్‌కు ఓటేస్తే కష్టాలే..
- ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి
- బీఆర్ఎస్‌లో చేరికలు



బీఆర్ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే, గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి

కృష్ణకాలనీ, నవంబర్ 5 : పేదల సంక్షేమమే బీఆర్ఎస్ పార్టీ లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. మొగుళ్లపల్లి మండలంలోని పర్లపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ పార్టీల యువకులు జడ్పీటీసీ జోరుక సదయ్య ఆధ్వర్యంలో ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పేదల సంక్షేమ పార్టీ, అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి సాధించారన్నారు. 2023 ఎన్నికల సందర్భంగా సీఎం కేసీఆర్ విడుదల చేసినా బీఆర్ఎస్ మ్యానిఫెస్టోకు ఆకర్షితులై ప్రతిరోజూ వందల మంది యువకులు పార్టీలో చేరుతున్నారన్నారు. గత పదేండ్లలోని బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు ఆదరిస్తారని ధీమా వ్యక్తం చేశారు. భూపాలపల్లిలో గులాబీ జెండా ఎగురడం ఖాయమన్నారు. పార్టీలో చేరినా వారికి సముచిత స్థానం కల్పించి అండగా ఉంటామన్నారు. నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లిన ప్రజలు పార్టీకి బ్రహ్మరథ పడుతున్నారన్నారు. కొంత మంది పగటి వేషగాళ్లు తమకు ఒక్క అవకాశమివ్వండని దొంగ ఏడుపులు ఏడుస్తున్నారని విమర్శించారు. అలాంటి నాయకులను నమ్మి ఓటువేసి మోసపోవద్దన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే... రాష్ట్రంలో కరెంట్ కష్టాలు, రైతు ఆత్మహత్యలు వస్తాయన్నారు. 24 గంటల కరెంట్ ఉచితంగా ఇచ్చే బీఆర్ఎస్ పార్టీ కావాలా ? మూడు గంటలు చాలంటున్న కాంగ్రెస్ కావాలో ప్రజలు నిర్ణయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ దిండ్యాల సత్యనారాయణ, సీనియర్ నాయకులు గోలి కృష్ణారెడ్డి, ఈర్ల అశోక్, పర్లపల్లి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సతీశ్‌కు నియామక పత్రం అందిస్తున్న జడ్పీ చైర్మన్ పుట్ట మధు

## బీఆర్ఎస్ ఎస్టీ సెల్ సబ్ డివిజన్ అధ్యక్షుడిగా సతీశ్

కాటారం, నవంబర్ 5 : బీఆర్ఎస్ ఎస్టీ సెల్ కాటారం సబ్ డివిజనల్ అధ్యక్షుడిగా తైనేని సతీశ్‌ను నియమించారు. అలాగే మండల ఎస్టీ సెల్ విభాగం అధ్యక్షుడిగా సుంకరి మల్లేశ్, ప్రధాన కార్యదర్శిగా అంగోతు బన్సీలాల్, ఉపాధ్యక్షుడిగా వినోద్‌కుమార్, మండల ఉపాధ్యక్షుడిగా తోట రాంచందర్‌ను నియమించారు. వారికి ఆదివారం జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ నియామక పత్రాలు అందజేశారు. ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని, కేసీఆర్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని గడప గడపకూ వెళ్లి వివరించాలని సూచించారు.



బొగత జలపాతం వద్ద పర్యాటకుల సందడి

## 'బొగత' వద్ద సండే సందడి

వాజేడు, నవంబర్ 5: మండలంలోని చీకుపల్లి అటవీ ప్రాంతంలోని బొగత జలపాతం వద్ద ఆదివారం పర్యాటకుల సందడి కనిపించింది. రాష్ట్ర నలుమూలల నుంచి పర్యాటకులు వచ్చి బొగత అందాలను వీక్షించారు. తెలంగాణ నయాగారా అందాలను చూసి ఫిదా అయ్యారు. జలపాతం వద్ద స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి సెల్ఫీలు, ఫొటోలు దిగారు. జలపాతంలో స్నానాలు చేస్తూ ఆనందంగా గడిపారు. పర్యాటకులతో జలపాత పరిసరాల్లో కోలాహలం నెలకొంది.

## ప్రతాపగిరి గుట్ట పరిశీలన

కాటారం, నవంబర్ 5 : మండలంలోని ప్రతాపగిరి గుట్టపై జిల్లా పోలీస్ బాస్‌లు పర్యటించారు. భూపాలపల్లి, ములుగు జిల్లాల ఎస్పీలు కిరణ్ ఖరే, గౌస్ ఆలం, అడిషనల్ కలెక్టర్ ఉమా శంకర్ అటవీ ప్రాంతంలోని గొంతెమ్మ గుట్టపైకి ఆదివారం కాలినడకన చేరుకున్నారు. గుట్టపై ఉన్న పాండవుల భేరి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. 5 కి.మీ నడిచి గుట్ట పరిసరాలు, చారిత్రక కట్టడాలను పరిశీలించారు. పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు చొరవ తీసుకుంటామని తెలిపారు. అక్కడి ప్రకృతి రమణీయత, చరిత్రను తెలుసుకునేందుకు గుట్టను సందర్శించినట్లు పేర్కొన్నారు. కాగా ఎన్నికల సమయం కావడంతో మావోల్ల నిఘా కోసం గుట్టపైన పరిశీలించినట్లు తెలుస్తోంది. వారి వెంట కాటారం సీఐ రంజిత్‌రావు, ఎస్సైలు అభినవ్, సుధాకర్, లక్ష్మణ్ రావు ఉన్నారు.



ప్రతాపగిరి అటవీ ప్రాంతంలోని గొంతెమ్మ గుట్టపై పోలీసులు



బీఆర్ఎస్‌లో చేరిన వారితో జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు

# అభివృద్ధిని చూసి ఆశీర్వదిస్తున్నారు..

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహారావు
- పార్టీలో పలువురి చేరిక

గోవిందరావుపేట, నవంబర్ 5 : సీఎం కేసీఆర్ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నారని, రాష్ట్ర అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌ను ఆశీర్వదిస్తున్నారని పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు అన్నారు. మండలంలోని పస్రాలో ఆదివారం మండల ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యులు బూర సురేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో 100 మంది బీఆర్ఎస్‌లో చేరారు. వారికి లక్ష్మీనర్సింహారావు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ములుగు జిల్లాకు రూ. కోట్లు వెచ్చించి అభివృద్ధి చేసిందన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నాగజ్యోతికి ఓటు వేయాలని కోరారు. నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్ఎస్‌లో భారీ సంఖ్యలో చేరుతున్నారన్నారు. పార్టీ ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటుందన్నారు. కష్టపడి పని చేసిన వారికి సముచిత న్యాయం కల్పిస్తామన్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో, అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సూడి శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీటీసీ తుమ్మల హరిబాబు, మండల అధ్యక్షుడు సూరపనేని సాయికుమార్, గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, ఎంపీటీసీ స్వరూప, నాయకులు బంజారు క్రాంతి, ఉప్పుతల కోటి పాల్గొన్నారు.

## నేటి నుంచి టెన్త్ విద్యార్థులకు
# ప్రత్యేక తరగతులు ప్రారంభం

**డీఈవో ఎన్ రాంకుమార్**

భూపాలపల్లి రూరల్, నవంబర్ 5: ప్రభుత్వ పాఠశాలల టెన్త్ విద్యార్థులకు నేటి (సోమవారం) నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు డీఈవో ఎన్ రాంకుమార్, ఉమ్మడి పరీక్షల బోర్డు జిల్లా కార్యదర్శి ఒంటేరు చంద్రశేఖర్ ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ తరగతుల నిర్వహణకు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ప్రతిరోజూ ఉదయం ఒక గంట విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. డిసెంబర్ నాటికి అన్ని సబ్జెక్టుల సిలబస్ పూర్తి చేయాలని, జనవరి నుంచి ఉదయం, సాయంత్రం గంట సేపు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని తెలిపారు. విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించి, రాష్ట్ర స్థాయిలో జిల్లా ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. నెల వారీగా విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలని, ప్రత్యేక తరగతులకు విద్యార్థులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.



రామప్ప ఆలయంలో ఆస్ట్రేలియా దేశస్తులు

## రామప్పలో పర్యాటకుల కోలాహలం

వెంకటాపూర్, నవంబర్ 5 : మండలంలోని రామప్ప దేవాలయం ఆదివారం పర్యాటకులు, విద్యార్థులు, భక్తులతో సందడిగా మారింది. వివిధ రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో పర్యాటకులు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. పూజారులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ చరిత్ర, విశిష్టతను టూరిజం గైడ్స్ వివరించగా ఆసక్తిగా విన్నారు. ఆలయంలో ఉత్సాహంగా కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఫొటోలు, సెల్ఫీలు దిగారు. అనంతరం రామప్ప సరస్సుకు చేరుకొని బోటింగ్ చేసి ఆహ్లాదంగా గడిపారు.

**సందర్శించిన ఆస్ట్రేలియా దేశస్తులు**

ఆదివారం రామప్పను ఆస్ట్రేలియా దేశస్తులు రాబిన్, మిచెల్, మెర్ఫీ, కేరీ, వెన్నో సందర్శించారు. ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాముఖ్యతను గైడ్ ద్వారా తెలుసుకున్నారు. 800 సంవత్సరాల క్రితమే అద్భుతంగా టెంపుల్‌ని నిర్మించడం గ్రేట్ అని అన్నారు. అలాగే రామప్ప చెరువును సందర్శించారు.

## పుట్ట మధూకర్ వాహనం తనిఖీ

మల్హర్, నవంబర్ 5 : ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో అన్ని చోట్ల చెక్ పోస్టులు ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్ని పోలీసులు తనిఖీ చేస్తున్నారు. అందులో భాగంగానే మండలంలోని కొయ్యూరు చెక్ పోస్టు వద్ద మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్, ఆయన వెంట ఉన్న వాహనాలను ఆదివారం పోలీసులు తనిఖీ చేశారు. వాహనాల తనిఖీకి మధూకర్ సహకరించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, సజావుగా పూర్తయ్యేలా చూడాలని పోలీసులకు సూచించారు.

# బీజేపీ జిల్లా కోశాధికారి తిరుపతి రాజీనామా



కాటారం, నవంబర్ 5 : మండల కేంద్రానికి చెందిన బీజేపీ జిల్లా కోశాధికారి దుర్గం తిరుపతి ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి ఆదివారం రాజీనామా చేశారు. 1998 నుంచి ఇప్పటివరకు బీజేపీ మండల అధ్యక్షుడు, ఉమ్మడి జిల్లా బీజేపీ ప్రచార కార్యదర్శి, దళిత నేతగా పార్టీలో క్రియాశీలక పాత్ర పోషించారు. తిరుపతి ఆ పార్టీకి రాజీనామా చేయడం చర్చనీయాంశమైంది. బీజేపీలో దళితులకు ప్రాధాన్యత లేకపోవడం వల్లనే రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే తిరుపతి బీఆర్ఎస్‌లో చేరనున్నట్లు తెలిసింది.



పుట్ట మధూకర్ వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు